# శ్రీమతి ఒక బహుమతి

-యం.పి.చంద్రశేఖరరావు

"నేను బొబ్బిలి కాలేజీలో చదువుకుంటున్నప్పుడు మా రూంమేట్స్ అందరం కలసి వండుకునే వాళ్లం. నేను వంట చేసిన రోజు అందరూ సుష్టుగా తినేవారు. నా పాకశాస్త్ర ప్రావీణ్యం గురించి నీకు తెలియదు. నీకు వెరైటీ రాదు. ఎప్పుడూ ఇవే వంటలు. మేమైతే రోజుకొక వెరైటీ వండుకునే వాళ్లం. ఆవురావురుమని తినేసేవాళ్లం. ఇప్పుడు నోటిలో ముద్ద దిగడం లేదు. నోట్లోకి తోయాల్సి వస్తోంది. పాపం! ఈ పిల్లలకు మంచి రుచి అంటే ఏమిటో తెలియదు. నేను చేసిన వంట ఒక్కసారి తిన్నారంటే మరి జీవితంలో నీ చేతి వంట తినరు" తన గొప్పతనాన్ని భార్య కాంతంకు వర్ణించాడు సుబ్బారావు.

"నా చేతివంట మీరు తప్ప అందరూ ఇష్టపడతారు. మీ అన్నయ్యలు, అక్కలు మనింటికి వచ్చిన ప్రతిసారీ నా వంటని పొగడకుండా వెళ్లరు" అంది కాంతం.

"ఆ...ఏదో మొహమాటానికి అంటారులే" అన్నాడు సుబ్బారావు.

"ఏదో వంక పెట్టాలని కాకుండా మనస్సాక్షిగా చెప్పండి" అంది కాంతం మళ్లీ.

"మావాళ్ళు వచ్చినప్పుడు ఒక వారం ఏదో బాగా వండుతావులే. వాళ్ళు చుట్టరికానికి వస్తారు కాబట్టి సరిపోయింది. ఇంకా నాలుగురోజులు ఇక్కడ ఉండి తిన్నారంటే తెలుస్తుంది"

"మనం హైదరాబాద్ వచ్చినప్పటినుంచీ ఎప్పుడూ చుట్టాలేకదా. ఇంతవరకూ ఎవరు కూడా నా వంట బాగాలేదనలేదు. అందరూ ఆనందంగా తిని వెళ్తారు" అంది కాంతం.

"నువ్వెన్నయినా చెప్పు కాంతం. నీకు నాలాగా వంట రాదు" అన్నాడు సుబ్బారావు.

"సరే నాకు వంట రాదని ఒప్పుకుంటున్నాను. ఒక వారంపాటు మీరు వండండి. మీ వంటల గురించి వినడమే కానీ ఇంతవరకూ రుచి చూడలేదు. మీరు చేస్తున్నప్పుడు చూసి నేను నేర్చుకుంటాను. తరువాత అలాగే మీకు వండి పెడతాను" అని ప్రపోజ్ చేసింది కాంతం.

"నాకెలా కుదురుతుంది? చాలా పనులు నాకుంటాయి"

"మీ పనులు ఏమిటో చెప్పండి. కూరగాయలు ఈవారం నేను తెస్తాను. అవసరమైతే కొంచెం ఖరీదైనా ఎదురుకొట్లో కొందాం. పిల్లల చదువు, బట్టల ఇస్త్రీ, బ్యాంక్, పోస్టాఫీసు పనులన్నీ నేను చూసుకుంటాను. వంట కూడా పూర్తిగా మీరు చేయనక్కర్లేదు. కూరగాయలు తరగడంలాంటి పనులు నేను చేసి అన్నీ మీకు కావలసినట్లు అమర్చిపెడతాను. అదికాకుండా అంట్లు ఎలాగూ నేనే తోముతాను. ఫైవ్‌స్టార్ హోటల్‌లో చెఫ్‌లు అందరూ మగవాళ్ళే. నలుడు, భీముడు మగవాళ్లే. మగవాళ్ళే బాగా వంటలు చేయగలరంటారు కదా ఎప్పుడూ. ఒక్క వారం మీరు చేయండి చూద్దాం" అంది కాంతం.

ఈ మాటలకు పిల్లలకుకూడా ఉత్సాహం వచ్చింది. నాన్న అయితే ఏదో వెరైటీ వంటకాలు చేస్తారు కదా అనే ఆశతో ఇద్దరూ కాంతాన్ని సపోర్టు చేసారు. ఎలాగైతేనేం సుబ్బారావు ఒప్పుకున్నాడు. ఎప్పుడైనా ఆఫీసులో అర్జంటు పని వుంటే ఆ రోజు చేయనని ముందే చెప్పాడు.

★★★

"మగవాళ్ళు వంట చేస్తే ఎన్నో లాభాలు. వంటల్లో పొడుగు వెంట్రుకలు పడవు. నేను వంట ఎలా చేస్తానో చూడు. కావలసినవన్నీ ముందే అందుబాటులో వుంచుకుంటాను. నీలా పొయ్యి మీద మూకుడు పెట్టి పోపుల డబ్బాకోసం వెతుక్కోను. ఉప్పు, కారం సుమారుగా వేయను. కొలిచి వేస్తాను. వంటను ఇంజనీరింగ్ ఇండస్ట్రీలో ఒక ప్రోసెస్‌లా చేస్తాను. వండే విధానాన్ని మూడు విభాగాలుగా విభజించి వంటను ఆడుతూ పాడుతూ చేస్తాను చూసుకో. ఈ రాత్రికి మీకు పసందయిన విందు" అని సుబ్బారావు లెక్చర్ ఇచ్చాడు.

సుబ్బారావు ఓవరాల్ వేసుకుని గరిట చేత పట్టుకుని స్టవ్ ముందు నిల్చుంటే ఈయన చాలా పసందైన వంటకాలు చేయబోతున్నాడని కాంతానికి నమ్మకం కుదిరిపోయింది.

సుబ్బారావు ఆత్మవిశ్వాసం, హావభావాలు, వండే విధానం గురించి చెప్పిన తీరు చూస్తుంటే బాగా ఆరితేరిన వంటగాడిలా కనిపిస్తున్నాడు. ఆయన ప్రక్కనే కాంతం కావాల్సిన సామానులు అందిస్తున్నది.

మధ్యమధ్యలో టీవీలో వంటల ప్రోగ్రామ్‌లోని చెఫ్‌లా నేరేషన్ చేస్తున్నాడు సుబ్బారావు. ఉల్లిపాయలు అడిగాడు, కానీ వాటిని ముక్కలు చేయడం మర్చిపోయింది కాంతం.

"ఇలా ఇవ్వు కాంతం. సులువుగా ఎలా కట్‌చేయాలో చెప్తాను" అని ఉల్లిపాయలు తీసుకుని కత్తితో కటింగ్ చేయడం మొదలుపెట్టాడు. కొద్దిసేపటికే "అమ్మా"అని కేకవేసి చూపుడువేలు పట్టుకుని గెంతడం ప్రారంభించాడు.

కాంతం కంగారుగా "ఏమయిందండీ?" అని దగ్గరకు వచ్చింది.

"ఉల్లిపాయలు కోస్తుంటే నైఫ్ మీద పడింది. రక్తం కారుతోంది" అన్నాడు.

కాంతం గబగబా ఇంత కాఫీపొడి వేసి పట్టుకుని "ఏం ఫర్వాలేదు. తగ్గిపోతుందిలెండి" అని ధైర్యం చెప్పింది.

"నో కాంతం...నేను ఈమధ్య టెటనస్ ఇంజెక్షన్ కూడా చేయించుకోలేదు. ధనుర్వాతం వస్తే చాలా ప్రమాదం. అలా ఇంజెక్షన్ చేయించుకుని వస్తానుండు" అని బయలుదేరాడు.

"అయితే వంట నేను చేస్తానులెండి" అంది కాంతం.

"నోనో నేనిప్పుడు వచ్చేస్తాగా. వచ్చిన వెంటనే చేస్తాను"

సుబ్బారావు తిరిగి ఇంటికి చేరుకునేసరికి తొమ్మిదయింది. అప్పటికే పిల్లలు ఆకలితో చుట్టుకుపోతున్నారు.

"నేను వంట చేస్తానులెండి. మీరు కూర్చోండి" మరోసారి అంది కాంతం.

"ఏంలేదు. చిన్నదెబ్బే. ఇప్పుడు నేను రెడీ" అని వంటింట్లోకి వెళ్లాడు సుబ్బారావు.

ఎలాగోలా వంట అయిందనిపించాడు. నిద్ర మొహంతో పిల్లలు తినేసారు. రుచిగా ఉందా లేదా అని చర్చకు రాలేదు.

కానీ తన వంట బాగోలేదని సుబ్బారావుకు అర్థమయింది. హడావుడిగా చేయడంవలన ఇలా అయిందని సరిపుచ్చుకున్నాడు.

***

మరుసటి రోజు ఉదయాన్నే మళ్లీ కాంతం అంది "మీరేంచేస్తారుగానీ ఎప్పటిలాగే నన్ను చేసుకోనివ్వండి'' అని.

"నో...నథింగ్ డూయింగ్. ఈ విషయంలో రాజీలేదు. ఈపూట నాతడాకా చూపిస్తాను'' అని అన్నాడు.


ఉదయం పళ్ళు తోముకోవడం లాంటి తన పనులు చేసుకుని టైం చూస్తే సుబ్బారావుకు గుండె దడ ప్రారంభమయింది. గబగబా వంట పని చేసాడు.

కాంతం సుబ్బారావుకు, పిల్లలకు టిఫిన్ బాక్సులు అమర్చింది.

పరుగులాంటి నడకతో సుబ్బారావు బస్టాప్‌కు వెళ్లాడు. అప్పటికే ఆఫీసు బస్సు వెళ్లిపోయిందని కిరాణా కొట్టు అబ్బాయి చెప్పాడు. సుబ్బారావుకు ఏం చేయాలో అర్థంకాలేదు. ఆఫీసు బస్సు తప్పిపోయినా దీనిని ఒక అవకాశంగా తీసుకోవాలి.

ఈ రోజు సాయంత్రం వంట కోసం ఇప్పటినుంచే ప్రిపేర్ అవుతాను అని అనుకున్నాడు. తిరిగి ఇంటికి వచ్చి టీవీలో వచ్చే వంటల కార్యక్రమాలు జాగ్రత్తగా చూసాడు. కాంతం దగ్గరున్న వంట గురించి పేపర్ కటింగ్స్ శ్రద్ధగా చదివాడు.

***



మధ్యాహ్నం భోజనానికి భార్యాభర్తలిద్దరూ కూర్చున్నారు. టిఫిన్ బాక్స్‌లోని భోజనం తినడం ప్రారంభించాడు. కూర నోట్లో పెట్టుకునేసరికి షాక్ కొట్టినంత పనైంది.

ఏం తక్కువ అయిందో, ఏది ఎక్కువ అయిందో తెలియదుగానీ వెగటు పుట్టించే రుచి.

సుబ్బారావు ముఖంలో విచిత్రమైన భావాలు కనిపిస్తున్నాయి. కూర బాగోలేదని బయటకు చెబితే పరువు పోతుంది. అలాగని తినలేడు. అలాగే గుటుక్ గుటుక్‌మని మింగుతున్నాడు. కూర నాలికకు తగలకుండా జాగ్రత్త పడుతున్నాడు.

కాంతం కూర నోట్లో పెట్టుకుని 'వాక్'మని కక్కుకుంది.

"నీకు వెరైటీ వంటకాలు రావు. ఇంత మంచి రుచిగా చేసి పెడితే తినవు, నీ ఖర్మ'' అని సుబ్బారావు అన్నాడు మనసులో కూరను తిడుతూ.

"మీరెన్నయినా చెప్పండి. నేను ఈ వంటకాలను తినలేను'' అని వంటింట్లోకి వెళ్లి ఆవకాయ తెచ్చుకుంది. "అమ్మో నేనీ కూర తినలేను. మీకు ఎలాగూ నచ్చిందికదా మీరే తినండి'' అని ఉన్న కూరంతా సుబ్బారావుకు వేసింది. సుబ్బారావు మింగలేక కక్కలేక అలా చూస్తూ ఉండిపోయాడు.

సాయంత్రం పిల్లలు నీరసంగా స్కూలునుంచి వచ్చారు. మధ్యాహ్నం అన్నం తినలేక పారేసారుట. ఏమీ తినకుండా సాయంత్రం వరకూ అలాగే ఉన్నారు.

"మీ వంటకాలకు ఒక దండం, నన్ను చేయనివ్వండి. పిల్లలకు నేను వండి పెడతాను'' అంది కాంతం.

దానికి సుబ్బారావు "నో.. ఈ ఇంట్లో నేను తప్ప ఇంకెవ్వరూ ఈవారం వండకూడదు. ఒకే పిల్లలు ఆకలి అంటున్నారు కాబట్టి ఈ పూటకి హోటల్ నుంచి తెచ్చి పెడతాను'' అని గంభీరంగా అన్నాడు.

పిల్లలు హోటల్ నుంచి ఇష్టమైనవి తెప్పించుకుని సుష్టుగా తిన్నారు.

★★★

"ఎలాగైనా రాత్రి భోజనం రుచిగా అందరూ మెచ్చుకునేటట్లు చేయాలి. నేనేంటో నిరూపించుకోవాలి'' అని రకరకాల వంటల పుస్తకాలు ముందేసుకుని మరోసారి చదివాడు.

రాత్రికి ఏం చేయాలో ప్లాన్ చేసుకుని తెల్లకాగితం మీద రాసుకున్నాడు. అన్ని ఐటమ్స్ కొలతలు కొలిచి పెట్టుకున్నాడు. ప్లాన్ ప్రకారం వంటలు తయారయ్యాయి.

ఈసారి ఎవరిలోనూ నిన్నటి ఉత్సాహంలేదు. అందరూ భయంభయంగా నోట్లో పెట్టుకున్నారు.

మరీ చెడిపోలేదుగానీ రుచిగాలేదు. ముఖంలో ఎలాంటి భావాలు లేకుండా అందరూ తినేసారు.

ఇప్పుడు సుబ్బారావుకు అర్థమయింది ఇంతకంటే తనకు చేతకాదని. చదువుకునే రోజుల్లో వండుకునేటప్పుడు పరిస్థితి వేరు. అప్పుడు జిమ్‌కు వెళ్లి వచ్చి ఆకలితో ఉండేవాళ్లం. ఆ ఆకలికి ఏది పెట్టినా చివరకు గడ్డి అయినా రుచిగా ఉండేది.

మధ్యమధ్యలో తినడానికి చిరుతిళ్ళు ఉండేవికావు. కానీ ఇప్పుడు కాంతం చేసిన వంటల రుచి అలవాటు అయిన తరువాత నా వంటలు తినడం కష్టమే.

కానీ అలా అని ఒప్పుకుంటే నా గౌరవం పోతుంది. మరెలా...?

చివరకు సుబ్బారావుకు ఒక ఐడియా వచ్చింది.

"కాంతం! చెప్పడం మరచిపోయాను. రేపటినుంచి నాలుగురోజులు మా ఆఫీసులో ఆడిట్ వుంది. నేను ఉదయాన్నే వెళ్లాలి. సాయంత్రం రావడం కూడా లేటవుతుంది. ఈ నాలుగురోజులూ నువ్వే వండు. తరువాత నేను కంటిన్యూ చేస్తాను'' అన్నాడు.

అలా అబద్ధం చెప్పి వంట నుంచి తప్పించుకున్నాడు. ఉదయాన్నే తొందరగా ఆఫీసుకు వచ్చి సీట్లో ఒంటరిగా కూర్చున్నాడు. సాయంత్రం అందరూ వెళ్లిపోయాక చాలాసేపు కూర్చుని ఇంటికి వెళ్లాడు.

అలా నాలుగురోజులు గడిచిన తరువాత సుబ్బారావుకు గుర్తున్నా నేను వంట చేస్తానని అనలేదు. కాంతం కూడా ఈ విషయం ఎత్తడానికి సాహసించలేదు.

'అమ్మయ్య...కాంతం నా వంట గురించి మర్చిపోయింది. అనవసరంగా గొప్పలకు పోయాను. కాంతం వంటలు చాలా బాగుంటాయి. ఇకముందు తన వంటలకు వంక పెట్టకూడదు. శ్రీమతి నాకొక బహుమతి' అని సుబ్బారావు మనసులో అనుకున్నాడు.

★



## ప్రత్యేకాకర్షణ

'మాస్' వంటి మంచి మసాలా మాస్‌చిత్రానికి దర్శకత్వం వహించిన లారెన్స్ ఇప్పుడు నిర్మాతల పాలిట మంచి చాయిస్‌గా మారాడు. ఆనంది ఆర్ట్స్ వారు తమిళం, తెలుగులో నిర్మిస్తున్న ఓ చిత్రానికి లారెన్స్ డైరెక్షన్ చేయడం చర్చనీయాంశం అయింది. మే నెలలో షూటింగ్ ప్రారంభించుకోనున్న ఈ చిత్రాన్ని కూడా మంచి హిట్ చేయాలని లారెన్స్ భావిస్తున్నాడు. 'స్టయిల్' చిత్రంతో దర్శకత్వంలో కొత్త చరిత్ర సృష్టించిన లారెన్స్‌కి ఈ ద్విభాషాచిత్రం ఏమేరకు హిట్ అవుతుందో చూద్దాం.

